క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ

కొండపి: మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను స్క్వాడ్ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికి స్థానిక గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని, శ్రీ చాణిక్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రాంబాబు, చంద్రశేఖర్ ఆయా కేంద్రాల్లోని ప్రత్యేక అధికారులతో మాట్లాడి సెంటర్లలో వైద్య సిబ్బందితో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. హనుమంతునిపాడు సెంటర్‌లో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణహాని నుంచి బయటపడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.

విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

కనిగిరిరూరల్: విద్యాలయాల్లో మౌలిక వసతుల, ఉపాధ్యాయుల కొరత సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు పీవీ శేషయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల, ఆశ్రమ, కస్తూరిబా, మోడల్ స్కూల్‌లు సమస్యలతో కునారిల్లుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న కస్తూర్బా పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు(టీచర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏఎన్ఎం, వంటమనిషి తదితర) ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని, మోడల్ స్కూల్‌లో టీచర్ల కొరత సమస్య, తాగు, వాడుక నీటి సమస్య, ప్రహరీ సమస్య, రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు, పాలకులు దీనిపై దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఛలో పార్లమెంట్ జయప్రదం చేయండి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

పామూరు: రవాణా రంగాన్ని రక్షించుకుందాం, కార్మిక హక్కులు కాపాడుకుందాం అనే నినాదంతో ఈ నెల 24న తలపెట్టిన ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. ఛలోపార్లమెంట్ విజయవంతం కోరుతూ శనివారం పామూరు, మండలంలోని పలు గ్రామాల్లో ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. సత్యనారాయణ, అశోక్, సుల్తాన్, కొండయ్య, ప్రతాప్ పలువురు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక పులి వెంకటరెడ్డి పార్క్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ జలవనరులను సంరక్షించుకుని ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వర్షం నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టుకోవాలని సూచించారు. నీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, వెంకట సుబ్బయ్య, పారాలీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో తిరగబడి ఇద్దరికి గాయాలు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని ఆటో తిరగబడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జాతీయరహదారిపై పెరల్ డిస్టిలరీ కంపెనీ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కావలి నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆటోను డ్రైవర్ అదుపుతప్పి కంపెనీ సమీపంలోని డివైడర్‌ను బలంగా ఢీ కొట్టడంతో ఆటో తిరగబడింది. ప్రమాదంలో ఆటో అద్దాలు ధ్వంసం కాగా అందులో ఉన్న డ్రైవర్ బి.వల్లూరయ్య, బి. గురవయ్యకు స్వల్ప గాయలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

కొండెక్కిన పశుగ్రాసం

- భారంగా పశు పోషణ
- వరి మిషన్ల నూర్పిళ్లే కారణం
- పెరిగిన ఖర్చులతో గిట్టుబాటు కాని వైనం
- గ్రామాల్లో తగ్గుతున్న పాడి గేదెల శాతం



వరిగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ లో తరలిస్తున్న రైతులు

కొండపి: దేశానికి వెన్నెముక రైతు అయితే..రైతుకు వెన్నెముక పశుసంపద. అలాంటి పాడి పోషణ ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో పశువుల సంఖ్య ఏటేటా గణనీయంగా తగ్గిపోతున్నాయి. చివరికి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్యాకెట్ పాలు తాగాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో గతంలో అధిక మేర గేదెలు ఉండగా ప్రస్తుతం అవి సగానికి పైగా తగ్గాయి. పశుగ్రాసం కొరత పెరుగుతున్న దాణా ఖర్చులతో రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు కష్టపడినా రోజు కూలి కూడా రాని దయనీయమైన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో లీటర్ పాలు వంద రూపాయలు అయ్యే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా పెరుగుతున్న ఖర్చులు...

పాడి గేదెలకు అందించే గడ్డితో పాటు మినరల్ మిక్చర్ దాణా కొబ్బరిపొడి, మినప్పొట్టు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు వరి పంటలను మిషన్లతోనే నూర్పిళ్లు చేయడంతో వరిగడ్డి ఉపయోగం లేకుండా పోయింది. వరి సాగులో కుప్పలు వేసి నూర్పిల్లు చేసే రైతులు తగ్గిపోవడంతో గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. గతంలో రూ.50 ఉన్న ఎండు గడ్డి కట్ట ప్రస్తుతం రూ.70 నుంచి రూ.100 వరకు పెరిగింది. అధిక ధర వెచ్చించినా గడ్డి సమృద్ధిగా దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గేదెలను మేపడం వీలుకాక చాలామంది ఒకటి రెండు గేదెలను ఉంచుకొని మిగిలిన వాటిని అమ్ముకుంటున్నారు. కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి రైతులు వరి కోతలను యంత్ర పరికరాలతో కోయించడంతో వరిగడ్డి పనికిరాకుండా పోతుంది.

గిట్టుబాటు కానీ ధరలు..

ఎంతో కష్టపడి కేంద్రానికి పాలు పోస్తే అక్కడ లభిస్తున్న ధరలు గిట్టుబాటు కావడం లేదని పాల ఉత్పత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెన్నశాతం తక్కువగా ఉండడంతో లీటర్‌కు రూ.50 నుంచి రూ.60 మించి రావడం లేదని రైతులు వాపోతున్నారు. వచ్చే ఆదాయం మొత్తం పెట్టుబడులకే పోతుండడంతో లాభాలు రాక పశువులను విక్రయిస్తున్నారు. సంక్షోభంలో ఉన్న పాడి పరిశ్రమను ప్రభుత్వం తగిన సహకారం అందించి ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.



గిట్టుబాటు కావడం లేదు.

మార్కెట్లో పెరిగిన ధరలకు దాణా, తదితరాలను కొనుగోలు చేసి పశువులను మేపాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. పోసిన పాలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నాం. పాలకు గిట్టుబాటు ధర కల్పించి పశుపోషకులను ఆదుకోవాలి.

– కె.బ్రహ్మయ్య, కొండపి



పశువులను అమ్ముకుంటున్నాం

పాలు విక్రయించగా వచ్చిన నగదు బయట మార్కెట్లో కొనుగోలు చేసి పశుగ్రాసానికి అయ్యే ఖర్చుకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రతి నెల నష్టాలు వస్తున్నాయి. దీంతో పశుపోషణ కష్టంగా మారడంతో పశువులను అమ్ముకుంటున్నాం. లీటర్‌కు కనీసం రూ.100 అయితే గిట్టుబాటు అవుతుంది.

– బి. వెంకటసుబ్బారావు, రైతు

భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం, తులసీ దళార్చన


స్వామివార్లకు పట్టువస్త్రాలు, మాలలు, మహానైవేద్యంతో ప్రదక్షిణలో భక్తులు

పామూరు: స్థానిక రుక్మిణి సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి తులసీదళార్చన, అభిషేకోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం సత్యబాబు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుక్మిణి, సత్యభామ, మదన వేణుగోపాలస్వామివార్ల మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశిష్ట అలంకరణ చేసి దాతలు సమకూర్చిన పట్టువస్త్రాలను విగ్రహమూర్తులకు అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం మహానైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనవసతి కల్పించారు. పూజలను ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షించారు. ఉభయదాతలు బయ్యపురెడ్డి, తిరివీధి ప్రసాదు, బండ్లా నారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బెట్టింగులకు దూరంగా ఉండాలి



ప్రేమ్‌కుమార్, ఎస్సై

కొండపి: ఐపీఎల్ నేపథ్యంలో యువకులు బెట్టింగులకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో బెట్టింగ్ రాయులు రెచ్చిపోయే పరిస్థితి ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత బెట్టింగులకు ఆకర్షితులై అత్యాశతో బెట్టింగ్ కాసి మోసపోవద్దన్నారు. వీటిని ఆసరాగా చేసుకొని మాఫియా తెలివిగా పందెపు రాయుళ్లనే తమ బుకీలుగా ఏజెంట్లుగా మార్చుకొని తమ కార్యకలాపాలను విస్తరింప చేసుకుంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్‌లకు ఆన్‌లైన్ నగదు బదిలీ చేసే వారిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రికెట్‌ను చూసి ఆనందించాలే గానీ బెట్టింగ్‌ల జోలికి వెళ్లి అప్పుల పాలై కుటుంబాలు, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి


వరిపైరును పరిశీలిస్తున ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): వరి, మినుము పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని డీజీపేట, రేగులచెలక గ్రామాల్లో శనివారం పొలంబడి నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు సాగుచేసిన వరి, మినుము పంటలను పరిశీలించిన ఏఓ వరిలో కాండం తొలుచు పురుగును గుర్తించి, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరిలో కాలిబాటలు తీయడం వల్ల పురుగుమందులు, ఎరువులు చల్లేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఏపీఓ పావలి శ్రీనివాసులు, పి.చిరంజీవిరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చొప్పర రత్నకుమారికి నివాళులు


రత్నకుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చొప్పర వెంకన్న భార్య రత్నకుమారి చిత్రపటానికి శనివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బాలయోగినగర్ లోని నివాసంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకన్నను పరామర్శించి ధైర్యం చెప్పి అండగా ఉంటానన్నారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, రావూరి ప్రభావతి, షేక్ నౌషాద్, సాయి, కె.హనుమంతరావు, సయ్యద్ ఆబిద్‌ఆలీ, షేక్ మహమ్మద్ బాషా, షేక్ అబ్దుల్లా, పి.సునీల్, సాయివేణు, మిడసల అశోక్, చిడిపూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జరుగుమల్లి ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి తల్లి శ్రీదేవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. జరుగుమల్లిలోని నివాసంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనిల్‌కుమార్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తాటికొండ రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ధాకా పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను మూసివేయవద్దు

- ఎమ్మెల్యేకు దళిత, విద్యార్థి, ప్రజా సంఘాల వినతి

కనిగిరిరూరల్: పట్టణంలో ఉన్న ఒక్క ఎస్సీ హాస్టల్‌ను మూసి వేసి ఇతర ప్రాంతాలకు తరలించవద్దని డీహెచ్‌పీఎస్, దళిత, విద్యార్థి, ప్రజా సంఘాలు శనివారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ప్రజా దర్బార్‌లో ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా ఎమ్మెల్యేకు లిఖిత పూర్వక విన్నపాలు చేశారు. 46 ఏళ్ల నుంచి ఉన్న ఒక్క ఎస్సీ హాస్టల్‌ను మూసి వేస్తే ఎస్సీ సామాజిక వర్గాని చెందిన విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇతర హాస్టల్స్‌లలో ఎస్సీలకు సీట్ల సంఖ్య తక్కువగా ఉంటుందని, దీని వల్ల ఎస్సీ విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని వివరించారు. హాస్టల్ భవనం ఆధునీకరణ జరుగుతుంది, హాస్టల్‌ను ఎక్కడి తరలించడం లేదని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, శాంత రాజు, కొటికర్ల బాదుర్లా, నారాయణ, మహేష్, ధర్మ, విద్యార్థి సంఘ నాయకులు ఖాశింపీరా, సీహెచ్ పవన్ కళ్యాణ్, గూడూరు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరిరూరల్: మండల పరిషత్ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి విన్నవించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రహీం మాట్లాడుతూ మండల సమావేశాలకు అధికారులు గైర్హాజరు అవుతున్నారని. సమస్యలు కనీసం పట్టించుకునే వారు లేరన్నారు. రైల్వేలైన్ అధికారులు కనిగిరి– గార్లపేట రోడ్డులో పనులు చేసి అనంతరం వ్యర్థాలను, మట్టిని రోడ్లపక్కనే వేశారని, దీని వల్ల వాహన దారులు, ప్రజలు ఆ దారిలో వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. మండలంలోని తాళ్లూరు వద్ద ఉన్న మాకేరు వాగుపై బ్రిడ్జి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, దీనివల్ల 250 ఎకరాలకు పారుదల వస్తోందని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

సారు...అమ్మకు వందనం ఎప్పుడు..?.

సార్....అమ్మకు వందనం పథకం ఎప్పటి నుంచి ఇస్తారని వైస్ ఎంపీపీ ఎల్ తిరుపతిరెడ్డి సభలో అధికారులను, ఎమ్మెల్యేను అడిగారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విద్యుత్, నీటి సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల తీరుపై కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు లంచాల కోసం ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదన్నారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, వైస్ ఎంపీపీలు ఎల్ తిరుపతిరెడ్డి, గాలిబోయిన ధనుంజయ్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ప్రజా దర్బార్‌ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడారు. కనిగిరి టౌన్, రూరల్, వివిధ గ్రామాల నుంచి 55 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

85 పొగాకు బేళ్లు తిరస్కరణ


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర కేజీ రూ.260 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అయ్యప్పరాజుపాలెం, మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 406 బేళ్లను వేలానికి తీసుకురాగా వ్యాపారులు 321 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 85 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.271.11 పలికింది. వేలంలో 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.

కనిగిరిరూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి పట్టాభిరామపురం, గానుగపెంట గ్రామాల రైతులు శనివారం 91 బేళ్లను తీసుకువచ్చారు. అందులో వ్యాపారులు 74 బేళ్లనుకొనుగోలు చేయగా 17 బేళ్లను తిరస్కరించారు. గరిష్టధర రూ.280, కనిష్ట ధర రూ.264, సరాసరి రూ.278.48గా నమోదైంది. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా గ్రేడింగ్ చేసిన తర్వాతే చెక్కులను వేలానికి తీసుకురావాలన్నారు. వేలంలో 6 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యానాది జాలర్ల అభివృద్ధికి కృషి

పొన్నలూరు: మండలంలో యానాది జాలర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ శ్రీను అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా శనివారం మీనోత్సవం కార్యక్రమం చేపట్టి పొన్నలూరు, బోగనంపాడు చెరువుల్లో 40 వేల చాప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాది జాలర్ల అభివృద్ధి కోసం రాగండి, మొసా, బొచ్చా, గండి వంటి రకానికి చెందిన చేప పిల్లలను చెరువుల్లో వదిలామన్నారు. వీటి పెంపకాన్ని స్థానిక యానాది జాలర్ల సహకార సంఘ వారికి అప్పగించామన్నారు. కొన్ని నెలలు తరువాత వీటిని యానాది జాలర్లు అమ్ముకోని అభివృద్ధి చెందవచ్చన్నారు. సింగరాయకొండ మత్స్యశాఖ అధికారిని వర్షిణి, మత్స్యశాఖ సహాయకుడు ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.


చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

పోర్టు భూముల సమస్యలను పరిష్కరిస్తాం

- సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

గుడ్లూరు: రామాయపట్నం పోర్టుకు భూములు ఇచ్చిన రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ శనివారం అన్నారు. చేవూరు గ్రామంలో పోర్టుకు భూములిచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోర్టు సంబంధించి రైతులు భూములు ఇచ్చినవారు 61 మందికి భూ సమస్యలు ఉన్నందున సభ ఏర్పాటు చేశామని చెప్పారు. 130 ఎకరాల్లో 62 మంది రైతులకు పరిహార సమస్య ఉన్నందున వారిలో 40 మందికి ఎటువంటి సమస్య లేకుండా పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిగిలిన 20 మందికి ఒకే సర్వే నెంబరులో ఇద్దరు పేర్ల మీద ఆన్‌లైన్ ఉందన్నారు. సమస్యలో ఎవరికి న్యాయమైతే ఆ రైతుకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుని విచారణ జరిపి పరిహారం అందిస్తామని చెప్పారు. ఒకే సర్వే నెంబరులో ఒక రైతు తన పొలాన్ని వేరే వారికి అమ్ముకుని మళ్లీ వచ్చి నాపేరు మీద ఆన్‌లైన్ భూమి ఉంది.. పరిహారం నాకు చెల్లించాలని వినతి పత్రాలు అందినట్లు చెప్పారు. అదే భూమికి సంబంధించి సుమారు 30 సంవత్సరాల నుంచి భూమి మా ఆధీనంలో ఉందని వినతి పత్రాలు ఇచ్చారని తెలిపారు. మళ్లీ గ్రామసభను ఏర్పాటు చేసి ఎవరి హక్కుదారులు, ఎవరికి న్యాయంగా పరిహారం చెందాలనేది విచారణ చేసి పరిహారం చెల్లిస్తామని ఆమె తెలిపారు. ఈ గ్రామసభలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పోర్టు డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్, తహశీల్దార్ స్వర్ణ పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు


గ్రంథాలను అందిస్తున్న పద్మనాభరావు

కందుకూరు రూరల్: ఉపాధి అవకాశాలపై నైపుణ్యం పెంచుకోవాలని దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా రేవూరి అనంత పద్మనాభరావు అన్నారు. కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభరావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు పొందేందుకు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్ తప్పనిసరిగా మెరుగుపర్చుకోవాలన్నారు. గ్రంథాలు అధ్యయనం, కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌ని ఏ విధంగా రాయాల్లో అవగాహన కలిగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ఆర్.జనార్ధన్ మాట్లాడుతూ నూతన సాంకేతికత ఏఐను ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలిపారు. తమ జ్ఞానాన్ని, నైపుణ్యాల్ని ఏ విధంగా పెంపొందించుకోవాలో వివరించారు. ప్రపంచంలో జరుగుతున్న నూతన పరిశోధనలను విద్యార్థులకు పరిచయం చేశారు. వీటిని స్ఫూర్తిని అందుకొని కళాశాల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం అనంత పద్మనాభరావు రచించిన గ్రంథాలను కళాశాల లైబ్రరీకి బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వవిద్యార్థుల కార్యదర్శి దాసు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండల నరేంద్ర, అధ్యాపకులు కె.సుజాత, ఎన్వీ శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

ఉలవపాడు: క్రీడలు ఆడటం వలన మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ శివన్నారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రామాయపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో అత్యధిక టీమ్‌లు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 27 గ్రామాల పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో రామాయపట్నం సర్పంచ్ అవనిగడ్డ వెంకటేశ్వర్లు, కర్లపాలెం సర్పంచ్ రమణయ్య, పెదపట్టపుపాలెం సర్పంచ్ ఆవుల జయరామ్, మెరైన్ ఎస్సైలు మస్తాన్ షరీఫ్, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు:

మండలంలోని మాలపాడు కేజీబీవీ పాఠశాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి శనివారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే 8వ తరగతిలో ఖాళీగా ఉన్న 3 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 11వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్‌కు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్‌లకు అర్హత పొందుతాయన్నారు. అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. వివరాలకు 9010638151 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.